క్లుప్తంగా

నేడు ఏఐపై వర్క్‌షాప్

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు వర్క్‌షాప్ కొనసాగుతుందని తెలిపారు.

పత్తి రైతుల కోసం 'కపాస్ కిసాన్' యాప్

బల్మూర్: పత్తి రైతులకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) కింద కొనుగోలు ప్రక్రియ సులభతరం చేయడం కోసం భారతీయ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్‌ను ప్రారంభించినట్లు ఏఓ కావేటి నరేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. యాప్‌లో వివరాలు నమోదు చేసుకొని స్లాట్ బుక్ చేసుకోవచ్చని వివరించారు. కేటాయించిన తేదీ ప్రకారం పత్తిని విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు తప్పని సరిగా తమ పంటలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేయించుకొని కోరారు.

ప్రతిభా పురస్కారాలు ప్రదానం



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. గురువారం కళాశాల ప్రాంగణంలో మిత్ర-85 ఆధ్వర్యంలో 1985 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఈ ఏడాది కళాశాలలో చదివిన విద్యార్థులలో ఉత్తమ ఫలితాలు సాధించిన 14 విద్యార్థులకు రూ.50వేల విలువైన ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ప్రిన్సిపాల్ రామ్‌రెడ్డి, లెక్చరర్లు, మిత్ర-85 బృందం సభ్యులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీఓ



తిమ్మాజిపేట: మండలంలోని పలు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీఓ లక్ష్మీదేవి పరిశీలించారు. ఇటీవల గ్రామాలలో గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శించిన విషయం విధితమే. అదేవిధంగా పీఎంఏవైజీ సర్వే, హేమ్లానాయక్ తండాలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణ పనులను, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడి టీచర్లు తదితరులు ఉన్నారు.

వంట మనుషులుగా విద్యార్థులు



లింగాల: గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న దినసరి వేతనం, ఔట్ సోర్సింగ్ సిబ్బంది తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 7 రోజుకు చేరుకుంది. దీంతో హాస్టల్‌లో భోజనం వండే వారు లేక పోవడంతో విద్యార్థులే వంట చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 300లకు పైగా విద్యార్థినులు ఉన్నారు. వర్కర్లు సమ్మె బాట పట్టడంతో అల్పాహారం, భోజనం వండే వారు లేక పోవడంతో, బాలికలు తరగతులను వదిలి భోజనం తయారు చేస్తున్నారు. సమ్మె ముగించేలా ప్రభుత్వ తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలోని పేదల ఆరో గ్యం కోసం ప్రాధాన్యం ఇస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. గురువారం కల్వకుర్తి మండలం గుండూరు గ్రామానికి చెందిన శ్యాంసుందర్ గౌడ్‌కు మంజూరైన రూ.60 వేలు సీఎం సహాయనిధి చెక్కును కల్వకుర్తిలో అందేశారు. కార్యక్రమంలో కాయతి విజయకుమార్ రెడ్డి, ఆనంద్‌కుమార్, గోలి సురేందర్ రెడ్డి, భూపతి రెడ్డి, రామకృష్ణ, హరీష్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన విజేందర్‌రెడ్డికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 26500 మంజూరయ్యాయి. లబ్ధిదారుడికి మార్కెట్ డైరెక్టర్ కృష్ణ అందజేశారు. లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీను, వెంకటయ్య, రాములు, కృష్ణయ్య, అనిల్, శ్రీనుఉన్నారు.

దుబ్బతండాలో..

దుబ్బతాండకు చెందిన వడ్యావత్ పన్నికి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.26వేలు మంజూరు అ య్యాయి. ఈ మేరకు లబ్ధిదారుడికి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి హైదరాబాదులోని ఆయన నివాసంలో అందజేశారు.

సంత సమస్యల చింత



తాడూరులో రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

- నిర్వహణకు స్థలంలేక అవస్థలు
- మౌలిక వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు

తాడూరు: మండల కేంద్రంలో నిర్వహించే వారాంతపు సంతలో సమస్యలు తిష్ట వేశాయి. సరిపడా స్థలం కేటాయించపోవడంతో వివిధ గ్రామాల నుంచి కూరగాయలు విక్రయించే రైతులు నానా అవస్థలు పడుతున్నారు. సంత ద్వారా ఏడాదికి పంచాయతీకి దాదాపు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నారు. ఆదాయం సమకూరుతున్నా అధికారులు మాత్రం మౌలిక వసతులు కల్పించడంలో విఫలం అయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. చూసి చూడనట్లు వ్యవహరించడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపైనే సంత నిర్వహణ

మండల కేంద్రంలో ప్రధాన చౌరస్తా రచ్చబండ చుట్టుతోపాటు పీర్ల చావిడి వరకు రహదారిపైనే ప్రతి శనివారం వారాంతపు సంత నిర్వహిస్తున్నారు. రోడ్లపైనే కూరగాయలు విక్రయించడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు కనీసం బైక్ పార్కింగ్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపైనే వాహనాలను నిలిపి కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయి. ఒక్కోసారి ట్రాఫిక్‌లో ఇరుక్కొని నరకయాతన అనుభవిస్తున్నారు. బయటపడేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

తప్పని తిప్పలు

తాడూరుతో పాటు యాదిరెడ్డిపల్లి, అంతారం, గుంతకోడూరు, మల్కాపూర్, గగ్గలపల్లి, మేడిపూర్, అల్లాపూర్, సుద్దకల్ గ్రామాల ప్రజలు వారాంతపు సంతలో కూరగాయలు కొనుగోలు, విక్రయాల కోసం వస్తుంటారు. సరిపడా స్థలం లేక పోవడంతో అసౌకర్యాలనికి గురవుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. సంత ప్రదేశంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయల విక్రయాల కోసం అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రత్యేక స్థలం కేటాయించి షెడ్లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్థలం కేటాయించాలి



సంత నిర్వహణకు ప్రత్యేక స్థలం కేటాయించాలి. రోడ్లపై సంత నిర్వహించడం వల్ల వాహనదారులు వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇరుకు రోడ్లపై కూరగాయలు విక్రయిస్తున్నా రు. వాహనాలు నిలిపేందుకు స్థలం లేదు. అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదు.

– యారి బాలస్వామి, తాడూరు

సమస్య పరిష్కారానికి కృషి



సంతలో నెలకొన్న సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక స్థలం కేటాయింపుపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తాం. మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాటుకు కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, తాడూరు



తాడూరులో రోడ్డుపైనే కొనసాగుతున్న సంత

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

పెద్దకొత్తపల్లి: భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని చంద్రకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉంటే సెల్: 9000101489 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఆయ పాఠశాలల హెచ్‌ఎంలు వెంకటేశ్వర్ రెడ్డి, సురేందర్ గౌడ్ లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఏఆర్ఐ శివకృష్ణ, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్ రావు, బంగారయ్య, వెంకటేశ్వర్ రావు, శివాజీ, రాజల్ రావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కల్వకుర్తి రూరల్: గ్రామ పంచాయతీలో పనిచేసే సిబ్బందికి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం డివిజన్ పరిధిలోని ఊర్కొండ, చారగొండ, కల్వకుర్తి మండలాలకు చెందిన కార్మికులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓ జనార్దన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికులకు రెండు నెలల నుంచి ఐదు నెలల వరకు వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, శంకర్, పరశురాములు, గెలవయ్య, కృష్ణమ్మ, హుస్సేన్, లక్ష్మమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

కోడేరు: పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి రవితేజకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు సాయిబాబు, రాజమౌళి, మహేష్, లక్ష్మయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



తిమ్మాజిపేటలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు



ఉప్పునుంతలో కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

కందనూలు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని నాగర్‌కర్నూల్ మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. మొదటి రోజు కబడ్డీ, వాలీబాల్ క్రీడలకు 400 మంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లత, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటయ్య, నాగర్‌కర్నూల్ డివిజన్ కార్యదర్శి సామ రమేష్, సుబాసిని, రాజున్‌గౌడ్, రమేష్ బాబు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

తెలకపల్లి: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావుపులే బాలుర గురుకుల పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. మొదటి రోజు 15 పాఠశాలల బాలబాలికలు పాల్గొన్నారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, ప్రిన్సిపాల్ ప్రశాంతి, డైరెక్టర్ రాజా మహేందర్‌రెడ్డి, బాలగౌడ్, శ్రీనివాసులు, హెచ్‌ఎం శోభన్‌బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

తిమ్మాజిపేట: చదువుతో పాటు క్రీడలు అవసరమని డీఎస్పీ శ్రీనివాస్‌లు అన్నారు. మండలంలోని ఆవంచలో ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడలను డీఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వల్ల శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. అంతకు ముందు మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించగా విజేతలకు యువ జాగృతి ఫౌండేషన్ ఆవంచ వారు బహుమతులను అందజేశారు. సీఐ అశోక్‌రెడ్డి, ఎంఈఓ సత్యనారాయణశెట్టి, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎంలు, పాల్గొన్నారు.

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్ పోటీలను ఎంఈఓ చంద్రశేఖర్‌తోపాటు కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్మూర్‌లో

బల్మూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 69వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీఓ రాఘవులు ప్రారంభించారు.అండర్ 14, 17 విభాగంలో క్రీడాకారులు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి పాండు, ఎంఈఓ విష్ణుమూర్తి, హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, పీఈటీలు జ్యోతీ, విజయ, పాండు, కర్ణచౌహాన్, మనీ, నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బల్మూర్‌లో కరచాలనం చేస్తున్న ఎంపీడీఓ

ముఖ్యమంత్రికి ఆహ్వానం



కల్వకుర్తి రూరల్: హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఎనముల రేవంత్‌రెడ్డిని గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డితో కలిసి ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, వాసవీ దేవస్థానం చైర్మన్ జూలూరు రమేష్ బాబులు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో 37 సంవత్సరాలుగా వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించే దసరా నవరాత్రి ఉత్సవాలు రావాలని సీఎంను ఆహ్వానించారు. అనంతరం ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాసా శేఖర్, ముత్యాలు, పాపిశెట్టి శ్రీనివాస్, ప్రవీణ్, వేణు, వీరేష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నేడు సురవరం సంస్మరణ సభ

నాగర్‌కర్నూల్ రూరల్/అచ్చంపేట/తెలకపల్లి: నాగర్‌కర్నూల్ పట్టణంలోని సాయిగార్డెన్‌లో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి దివంగత నేత సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండీ ఫయాజ్, అచ్చంపేట నియోజకవర్గ కార్యదర్శి పెరుముల గోపాల్, తెలకపల్లి మండల కార్యదర్శి వెనేపల్లి రవీందర్ గురువారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్స్ కమిటీ ఎన్నిక

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం రెవెన్యూ డివిజన్ స్థాయి అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మానసమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు హాజరై కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శోభావతి, ప్రధాన కార్యదర్శిగా పద్మ, ఉపాధ్యక్షురాలుగా అనసూయ, లక్ష్మి, కోశాధికారిగా జయమ్మతో పాటు పలువురు ఎన్నికయ్యారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు రూ.18 వేల జీతంతో పాటు జీఓ 8ని సవరించాలన్నారు. కార్యక్రమంలో నిర్మల, అలివేలు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని అమలు చేయాలి

తాడూరు: అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అందులో లోపాల కారణంగా పాలక వర్గాలు చట్టాన్ని బలహీన పరుస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికి గ్రామాల్లో కులవివక్షపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాలవెంకటయ్య, లక్ష్మయ్య, శివప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు వైద్య శిబిరం ఏర్పాటు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం, స్వస్తీనారిస్వస్తిక్ పరివార్ కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రలో డాక్టర్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 రోజులపాటు మహిళలకు నేత్రపరీక్షలు, రక్తపోటు, దంత, నోటి పరీక్షలకు చేయనున్నట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్‌చౌదరి, సహస్ర, సాయిరెడ్డి, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండలంలోని మాధవానిపల్లిలో పదర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్వస్తీనారిస్వస్తిక్ పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు మహిళలకు ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు.

మన్ననూర్: స్వస్తినారీ శక్తి కుటుంబ అభియాన్‌లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థోపెడిక్ సమస్యల ఉన్న మహిళల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పెంట్లవెల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు

లింగాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్ఎన్ఎస్‌పీఏ ప్రోగ్రాంలో అమలులో భాగంగా మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో గురువారం వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. వైద్య నిపుణుడు మౌర్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక



తాడూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి పాఠశాలల క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు సంబంధించి జిల్లా స్థాయిలో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం త్యాగరాజుగౌడ్, రమేష్, అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21 నుంచి కంటి వైద్య శిబిరం

తెలకపల్లి: మండల కేంద్రంలో సీఎల్ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి చీమర్ల రమేష్‌రెడ్డి, సీఎల్ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 27వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం సెల్: 9441591656, 9490500122 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

చీడ పీడల నివారణపై అవగాహన



తాడూరు: మండలంలోని తూమ్మలసూగురులో గురువారం చీడ పీడల నివారణపై రైతులకు రావేఫ్ విద్యార్థులు అవగాహన కల్పించారు. చీడపీడల నివారణ, ఎరువుల తయారీ విధానం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. వివిధ పరికరాల ద్వారా ప్రదర్శనలతో వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ స్వాతి, విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ



నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని తూడుకుర్తిలో గురువారం 5వ అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి పంచాయతీరాజ్ డీఈ గోవింద్, ఏఈ పవన్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. రూ.8లక్షల నిధులతో భవనం నిర్మిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



కోడేరు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎన్వీ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్క వేణుగోపాల్‌యాదవ్ వాలీబాల్, రింగ్‌బాల్, షటిల్ బ్యాట్, షాట్‌పుట్, తదితర క్రీడా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.

బహుమతుల ప్రదానం

కల్వకుర్తి రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఒకేషనల్ కళాశాలలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గీతారాణి విజేతలకు బహుమతులను అందజేశారు. మాజీ కౌన్సిలర్ మొగిలి పార్వతి, బోడా పావని, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అనర్హుల తొలగింపు



చారకొండ: ఓటరు జాబితాలో అనర్హులుగా ఉన్న వారిని గుర్తించి పేర్లను తొలగిస్తునట్లు తహసీల్దార్ అద్దంకి సునీత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది ఓటరు జాబితాను ప్రత్యేక పర్యవేక్షణలో పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మరణించినవారి, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారిని గుర్తించి జాబితాలో ఉన్న పేర్లను తొలగిస్తునట్లే పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరి రెడ్డి, ఎంఆర్ఐ భరత్‌కుమార్ గౌడ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీను, అధికారులు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ



లింగాల: మండలంలోని శాయిన్‌పేట, దత్తారం, కోమటికుంట పాఠశాలలను గురువారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఎఫ్ఆర్‌ఎస్‌ను అమలు చేయాలను సూచించారు. సమయ పాలన పాటిస్తూ విధులను నిర్వర్తించాలని కోరారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలి



పెంట్లవెల్లి: దివ్యాంగులకు పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఆడెపు నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సంపంగి మద్దిలేటి, వడ్డెమాన్ రాములు, బంకలి కురుమయ్య, బత్తిలి రాము, జమ్ములయ్య, బత్తిని పరశురాం తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో బోరు డ్రిల్లింగ్

చారకొండ: మండల కేంద్రంలోని కేజీబీవీలో తాగు నీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతుండటంతో ఎమ్మెల్యే వంశీకృష్ణ నిధులతో గురువారం బోరు డ్రిల్లింగ్ పనులను మాజీ జెడ్పీటీసీ వెంకట్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం బోరును బిగించారు. నీరు పుష్కలంగా రావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఎస్ఓ మంజుల, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాల్‌రాం గౌడ్, యూత్ ప్రసిడెంట్ గణేష్ గౌడ్, నాయకులు శివ, అంజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర కోశాధికారిగా బాలస్వామి

లింగాల: మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో విధులను నిర్వహిస్తున్న హెచ్‌డబ్ల్యూఓ సనాతన బాలస్వామి సీపీఎస్ సంఘం రాష్ట్ర కోశాధికారిగా నియమితులయ్యారు. గతంలో ఉమ్మడి జిల్లా సీపీఎస్ సంఘం అధ్యక్షుడిగా కొనసాగారు. గురువారం రాష్ట్ర అధ్యక్షుడు లింగమొల్ల దర్శనగౌడు, ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ నియామకం పత్రం అందుకున్నారు.

హిందీ భాషను ప్రోత్సహించాలి

పెద్దకొత్తపల్లి: ప్రతి ఒక్కరు హిందీ భాషను ప్రోత్సహించాలని వెన్నచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాము అన్నారు. గురువారం పాఠశాలలో హిందీ భాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖనం వివిధ అంశాలపై పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు హిందీ భాష దోహదపడుతుందన్నారు. హిందీ భాష ఉపాధ్యాయుడు షాకీర్ భాషను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. తిరుపతయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాములు, తిరుపతయ్య, ఉపాధ్యాయులు ఉమాదేవి, గంగాధర్, మొగులయ్య, ఉదయ భాస్కర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.